సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శనివారం । 19 । జూలై । 2025



ఈ కందిపప్పు మాకొద్దు
'అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా అయిన నాసిరకం కందిపప్పు మాకొద్దు' అని అంగన్వాడీ కార్యకర్తలు వెనక్కి పంపించారు.
-8లో



11 మంది గంజాయి విక్రేతల అరెస్టు
కడప నగర శివారులో గంజాయి విక్రయిస్తున్న 11 మందిని అరెస్టు చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
36.6/24.4

వాతావరణం
జిల్లాలో శుక్రవారం 24.4 - 36.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వీరభద్రస్వామికి కిలో వెండి వితరణ



వెండిని సమర్పిస్తున్న భక్తులు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారికి భక్తులు కిలో వెండిని వితరణగా అందజేశారు. శుక్రవారం కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లాకు చెందిన గురు మూర్తయ్య, చతురాచారి మట్‌లతో పాటు వారి కుటుంబ సభ్యులు స్వామి వారికి కిలో వెండిని సమర్పించారని ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి తెలిపారు. . దీనికి సంబంధించి ఆలయ అధికారులు రశీదును అందజేశారు. వీరి పేరున అర్చకులు స్వామి వారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



రామసముద్రం: రామసముద్రం మండల కేంద్రంలోని బయన్న ఇంటి ఆవరణలో బ్రహ్మకమలం పుష్పాలు గురువారం రాత్రి విరబూశాయి. వారి ఇంటి పెరట్లో ఉన్న బ్రహ్మకమలం చెట్టుకు సుమారు 15 పుష్పాలు పూశాయి. చుట్టుపక్కల ప్రాంతాలల ప్రజలు వీటిని చూసేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రతి ఏటా పుష్పాలు పూస్తాయని కుటుంబీకులు తెలిపారు.

అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించాలి



ఉపాధ్యాయ సంఘ నాయకులతో మాట్లాడుతున్న డీఈఓ షేక్ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించేలా సంఘ నాయకులు బాధ్యతలు తీసుకోవాలని డీఈఓ షేక్ షంషుద్దీన్ కోరారు. శుక్రవారం కడప డీఈఓ కార్యాలయ సమావేశం మందిరంలో ఉపాధ్యాయుల్లో అభ్యసనా సామర్థ్యం పెంపొందించే విషయమై ఉపాధ్యాయ సంఘ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల్లో అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడితే విద్యలో నాణ్యత పెరిగి విద్యార్థుల్లో విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు తమ వంతుగా ఉపాధ్యాయులకు అవగాహన పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డెయిరీ స్థలంలో బోర్డుల ఏర్పాటుపై సర్వే



అమూల్ డెయిరీ ఎదుట జాయింట్ సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మదనపల్లె రూరల్: అమూల్ డెయిరీ స్థలంలో ప్రైవేట్ వెంచర్‌కు చెందిన వ్యక్తులు రియల్ ఎస్టేట్‌కు సంబంధించి ప్రచార బోర్డులు ఏర్పాటు చేశారని 'సాక్షి' శుక్రవారం ప్రచురితమైన కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో ఆర్ఐ బాలసుబ్రహ్మణ్యం, సర్వేయర్ సుబ్రహ్మణ్యం తదితరులు సంబంధిత స్థలంలో జాయింట్ సర్వే నిర్వహించారు. రెవెన్యూ రికార్డుల్లో నేషనల్ హైవే ఎంతవరకు ఉందో, అంతవరకు కొలతలు వేసి హద్దులను మార్కింగ్ చేశారు. అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డులు ఆర్‌అండ్‌బీ స్థలంలో ఉన్నట్లు నిర్ధారించారు. బోర్డులు ఏర్పాటు చేసిన వ్యక్తులకు నోటీసులు జారీచేసి, పంచాయతీకి పన్ను కట్టించుకోవాల్సిందిగా కార్యదర్శికి సూచించారు. అయితే..రియల్టర్లు డెయిరీకి, బెంగళూరు ప్రధాన రహదారికి మధ్య తమకు చెందిన 7 సెంట్ల స్థలం ఉందని, అందులోనే బోర్డులు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు.

వీడని గండికోట రహస్యం

- చాలెంజ్‌గా మారిన బాలిక హత్య కేసు
- క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌కు లభించని ఆనవాళ్లు
- డీఐజీ తొందరపాటు చర్యలతో జిల్లా అధికారులకు తిప్పలు
- 18 మంది ఆఫీసర్లు బృందాలుగా విడిపోయి దర్యాప్తు కొనసాగింపు



డాగ్ స్క్వాడ్‌తో శోధన



గండికోటలో పరిశీలిస్తున్న ఎస్పీ, పోలీస్ అధికారులు

సాక్షి ప్రతినిధి, కడప: గండికోటలో బాలిక హత్య సంఘటన మిస్టరీగా మారింది. క్లూస్ టీమ్ పరిశీలించింది. డాగ్ స్క్వాడ్ పర్యటించింది. టవర్ లోకేషన్ తీశారు. ఫోన్ కాల్స్ టెక్నికల్ విశ్లేషణ చేస్తున్నారు. ఐదు రోజులుగా హత్య కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఇద్దరు ఐపీఎస్ స్థాయి అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో నలుగురు డీఎస్పీలు, నలుగురు సీఐలు, 10 మంది ఎస్ఐలు దృష్టి పెట్టారు. అవసరమైన మేరకు పోలీసులు ఉన్నారు. అయినప్పటికీ కేసులో ఎలాంటి పురోగతి లేదు. సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది.

రాష్ట్రంలో సంచలనం రేపిన ఘటన

పర్యాటక ప్రాంతమైన గండికోటలో మైనర్ బాలిక హత్య. ఒక్కమారుగా యావత్తు సమాజం ఉలిక్కిపాటుకు గురైంది. ఇంటర్మీడియెట్ చదువుతున్న బాలిక హత్య రాష్ట్రంలో సంచలనంగా మారింది. స్నేహితుడు లోకేష్‌తోపాటు బైక్‌లో గండికోటకు వెళ్లిన బాలిక.. తిరుగు ప్రయాణంలో లేదు. లోకేష్ ఒక్కరే మోటారు బైక్‌పై వస్తున్న ఫుటేజీ సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. దాంతో ఒక్కమారుగా లోకేష్ హత్య చేశారని అందరూ భావించారు. కాగా సాయంత్రానికి లోకేష్ వ్యవహారం తారుమారైంది. హత్యలో లోకేష్ ప్రమేయం లేదని ప్రకటన వెలువడింది. మరోవైపు అన్ని వ్రేళ్లు బంధువుల వైపు చూపాయి. స్నేహితుడు హత్య చేయలేదంటే.. పరువు హత్య చోటుచేసుకుందా? అనే కోణంలో విశ్లేషణలు, వ్యాఖ్యానం నడించింది. మృతురాలి బంధుగణాన్ని అదుపులోకి తీసుకున్నారు. అటు వైపు కూడా ఆధారాలు లభ్యం కాలేదు. ఆపై మరోమారు దర్యాప్తు మొదటికి వచ్చింది. ఈమారు జిల్లాలోని అధికారులు బృందాలుగా విడిపోయి హత్య కేసు విచారణ చేపట్టుతున్నారు.

తల పట్టుకుంటున్న పోలీసు అధికారులు

మైనర్ బాలిక హత్య కేసులో దర్యాప్తులో పోలీసు అధికారులు తలమునకలై ఉన్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో క్షేత్ర స్థాయిలో.. ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు ట్రైనీ డీఎస్పీలు, నలుగురు సీఐలు, 10 మంది ఎస్ఐలు బృందాలు విడిపోయి పలు రకాలుగా విశ్లేషణ చేస్తున్నారు. సీసీ ఫుటేజీలు ఆధారంగా అనుమానిత వాహనదారులను ప్రశ్నిస్తున్నారు.



టవర్ లోకేషన్ ద్వారా ఫోన్‌కాల్స్ విశ్లేషణ చేస్తున్నారు. ఎన్నో జాగ్రతలు తీసుకుంటున్నా వివరాలు బహిర్గతం అవుతుండటం దర్యాప్తునకు ప్రతిబంధకంగా మారుతోంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో జిల్లా పోలీసు యంత్రాంగం దర్యాప్తును కొనసాగిస్తోంది. సంక్లిష్టత మొత్తానికి ఉన్నతాధికారి తొందరపాటు చర్యలేనని పలువురు దెప్పి పొడుస్తుండటం గమనార్హం.

ఆ రెండు గంటల్లో ఏమి జరిగింది?

మైనర్ బాలికతో లోకేష్ రెండు గంటలు పాటు ఏకాంతంగా ఉన్నారు. గండికోటలో ఉండగా బంధువుల నుంచి ఫోన్ వస్తే వెనుతిరిగినట్లు చెప్పుకొస్తున్నారు. మరోవైపు బాలికపై ఎలాంటి అత్యాచార ఆనవాళ్లు లేవని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. రెండు గంటలు యువకుడు, యువతి ఒక రూమ్‌లో ఏకాంతంగా ఉండటంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా లోకేష్ ప్రమేయం లేదని డీఐజీ ప్రకటించిన తర్వాత.. బాధితులైన బంధువులను అందురూ అనుమానంగా చూసేందుకు ఆస్కారం ఇచ్చారు. ఇది మరో దారుణమైన వ్యవహారంగా పలువురు భావిస్తున్నారు.

డీఐజీ అత్యుత్సాహం

'తొందరపడి ఓ కోయిలా ముందే కూసింది' అన్నట్లుగా మైనర్ బాలిక హత్య కేసులో.. కర్నూలు రేంజ్ డీఐజీ తొందరపాటు చర్య స్పష్టంగా కన్పిస్తోంది. ఇలాంటి ఘటనల్లో ఉన్నతాధికారులు ఆశించిన స్థాయిలో చొరవ చూపడం సహేతుకం. ఎస్పీ అశోక్ కుమార్‌తోపాటు ఘటన స్థలానికి చేరకున్న డీఐజీ కోయ ప్రవీణ్ తొందరగా నిర్ధారణకు వచ్చారు. హత్యలో బాలిక స్నేహితుడు లోకేష్ ప్రమేయం లేదని ప్రకటించారు. అంతటితో ఆగకుండా సాయంత్రం నిందితుల్ని అదుపులోకి తీసుకొని.. ఎస్పీ హత్య వివరాలు తెలియజేస్తారని తెలిపారు. హత్య కేసులో ఎలాంటి పురోగతి లేకుండానే.. డీఐజీ స్థాయి అధికారి అలా ప్రకటించడం వెనుక అంతర్యం ఏమిటనేది ప్రశ్నార్థకంగా నిలుస్తోంది. అనుమానితుడిగా భావిస్తున్న లోకేష్‌కు డీఐజీ క్లీన్ చిట్ ఇవ్వడంతో.. ఒక్కమారుగా దృష్టి మళ్లింది. బాలిక సమీప బంధువుల వైపు అందరి దృష్టి మళ్లింది. పోనీ అటువైపు ఆధారాలు ఉన్నాయా? అంటే ఇప్పటికీ ఎలాంటి క్లూస్ లభించలేదు? బంధువులంతా దర్యాప్తు అధికారులకు సహకరించేందుకు సంసిద్ధులుగా ఉన్నారు. ఎప్పుడు ఫోన్ కాల్స్ వచ్చినా వెళ్లేందుకు అందుబాటులో ఉన్నారు.

నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలి



కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

కడప ఎడ్యుకేషన్: గండికోటలో జరిగిన బాలిక హత్యపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్, గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక సీమ కన్వీనర్ ఆంజనేయులు, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సగిలి గుర్రప్ప డిమాండ్ చేశారు. బాలిక మృతికి సంతాపంగా ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కడప నగరంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లా గండికోట పర్యాటక కేంద్రంలో ఐదు రోజుల క్రితం ఇంటర్ చదువుతున్న విద్యార్థిని హత్యకు గురైందన్నారు. ఘటన జరిగి ఐదు రోజులు గడిచినా వాస్తవాలను ప్రకటించక పోవడంలో రాజకీయ జోక్యం ఏమైనా ఉందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ఘటనలు చోటుచేసుకున్నాయని మండిపడ్డారు. హోంమంత్రి ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ఎస్సీ ఎస్టీ ఉమెన్ రైట్స్ కన్వీనర్ జేవీ రమణ, సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల ఓబయ్య, ఎంఆర్పీ జాతీయ అధ్యక్షులు సంగటి మనోహర్, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు యస్.రామాంజనేయులు, యస్.సుబ్బరాజు, హేతువాద సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఆల్ ఇండియా బంజారా సంఘం జిల్లా అధ్యక్షులు జగన్ నాయక్, పీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.నాగరాజు, ఐసా జిల్లా కార్యదర్శి ప్రసన్న, ఎస్సీ యాదవ్, లోకసత్తా పార్టీ అధ్యక్షులు దేవర కృష్ణ, రసూల్, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వేదిక రాష్ట్ర కన్వీనర్ నాగరాజు పాల్గొన్నారు.

బద్వేలులో భారీ వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

బద్వేలు అర్బన్ : బద్వేలులో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగి మురుగునీరు రోడ్లపైకి చేరింది. పట్టణంలోని మైదుకూరు రోడ్డు, మెయిన్‌బజార్, ఆంజనేయనగర్, రామాంజనేయనగర్, శాస్త్రినగర్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో రహదారుల పైకి మురుగునీరు చేరింది. మైదుకూరు రోడ్డులో భారీగా వర్షపు నీరు నిలిచి ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ గ్యారేజీలోకి మోకాలిలోతు నీరు చేరడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గ్యారేజీలోకి చేరిన నీటిని ఫైరింజన్ సహాయంతో బయటికి పంపించారు. మహబూబ్‌నగర్, మెయిన్ బజార్, త్యాగరాజకాలనీ చుట్టూ భారీగా వర్షపు నీరు చేరింది. ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీల్లో చెత్త నిల్వలు పేరుకుపోవడంతో మురుగునీరంతా రోడ్లపైకి చేరింది. మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి ఆధ్వర్యంలో లోతట్టు ప్రాంతాల్లో పూడికతీత పనులు చేపట్టి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు.



మైదుకూరు రోడ్డుపైకి చేరిన మురుగునీరు



ఆర్టీసీ గ్యారేజీలోకి చేరిన వర్షపునీరు

అవినీతికి కేంద్రం.. కారాగారం

- యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘన
- ఖైదీ వద్ద సెల్‌ఫోన్ అభ్యం
- నజరానాను బట్టి కొందరికి సౌకర్యాలు
- అక్రమాలపై డీఐజీ నివేదిక సిద్ధం



కడప కేంద్ర కారాగారం

కడప అర్బన్: కడప కేంద్ర కారాగారం అవినీతికి చిరునామాగా మారింది. ఇక్కడ యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. వివిధ అంశాల్లో అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇది కొందరు అధికారులు, సిబ్బందికి కాసుల పంటగా మారింది. ఎర్రచందనం స్మగ్లర్‌గా అనేక కేసుల్లో నిందితుడిగా వున్న జాకీర్ పీడీ యాక్ట్ కింద రిమాండ్‌లో వున్నాడు. అతని వద్దనే ఆకస్మిక తనిఖీల్లో దశల వారీగా 12 సెల్‌ఫోన్‌లు, ఛార్జర్ లభించినట్లు విచారణ అధికారిగా వచ్చిన డీఐజీ ఎంఆర్ రవికిరణ్ నిర్ధారణకు వచ్చారు. బాధ్యులైన వారిపై చర్యలకు సిఫారసు చేస్తూ ఉన్నతాధికారులకు నివేదికలు సిద్ధం చేసి పంపనున్నట్లు సమాచారం. సెల్‌ఫోన్‌లు బయటి నుంచి విసిరేస్తే లోపలికి వచ్చి పడుతున్నాయని, కొందరు అవినీతి అధికారులు, సిబ్బంది సహకారంతో రిమాండ్ ఖైదీల చేతికి చేరుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. బయటి నుంచి వచ్చిన సెల్‌ఫోన్‌లను కొన్ని సమయాల్లో ఖైదీలే తీసుకుని ఉపయోగించుకుంటున్నట్లు తెలుస్తోంది. సెల్‌ఫోన్‌ల వ్యవహారం తెలిసినా, తాము విధుల్లో వున్నపుడు రిమాండ్ ఖైదీ మాట్లాడుకుంటున్నా తమకేమీ పట్టనట్లు వుండే వారిపై ప్రస్తుతం చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. సెల్‌ఫోన్‌ల వ్యవహారంపై ప్రాథమిక విచారణకు వచ్చిన డీఐజీ ఎం.ఆర్.రవికిరణ్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాథమికంగా విచారణకు వచ్చామని, నివేదికను తయారు చేసి డీజీకి సమర్పిస్తామన్నారు. ఈ రిపోర్టు అవినీతి అధికారులకు వ్యతిరేకంగా ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.



పెట్రోల్ బంకులో చేతివాటం



కడప కేంద్రగారం ఆధ్వర్యంలో ఓ పెట్రోల్ బంకు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పని చేస్తున్న జీవిత ఖైదీల్లో కొందరు అక్రమార్జనకు సహకరించి కొందరు కారాగార అధికారులకు రూ.వేల నుంచి లక్షలాది రూపాయలను ముట్టచెబుతున్నట్లు సమాచారం. ఇక్కడ పని చేస్తున్న కారాగార సిబ్బంది, ఔట్‌గ్యాంగ్ ఖైదీలను ఎప్పటికప్పుడు విధులను మారుస్తూ, తప్పు జరిగినపుడు సరిదిద్దాల్సిన అవసరం ఎంతైనా వుంది. పెట్రోల్ నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించాల్సి వుంది.

డెయిరీ పాలు ఏమవుతున్నాయో?

కడప కేంద్ర కారాగారంలోని కీలక అధికారికి సంబంధించిన పెంపుడు కుక్క టామీకి రెండు లేదా మూడు లీటర్ల పాలు పంపించాల్సిందేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకానొక సందర్భంలో ఓ హెడ్ వార్డర్ తన పెంపుడు పిల్లికి కూడా పాలు ఇవ్వాలని పట్టుపట్టి మాట్లాడినట్లు సమాచారం. డెయిరీలో వచ్చిన 16 లీటర్ల పాలల్లో 14 లీటర్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కేవలం రెండు లీటర్ల పాలల్లో నీళ్లను కలిపి, రిజిస్టర్‌లో మాత్రం 16 లీటర్ల పాలు లోపలికి పంపిస్తున్నట్లు నమోదు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్యాకెట్ పాలను నేరుగా వ్యాన్ ద్వారానే లోపలికి పంపిస్తున్నట్లు.. లోపల లెక్క చూసుకుంటున్నారని సమాచారం.

ఖైదీలను ఆస్పత్రులకు తీసుకెళ్తూ..

కొంత మంది జీవిత ఖైదీలు కొందరు అవినీతి అధికారులను ఆశ్రయించి వైద్య పరీక్షలు, చికిత్సలు అంటూ కడప రిమ్స్‌కు, అక్కడి నుంచి కర్నూలు, విజయవాడ, హైదరాబాద్‌లకు రెఫర్ చేయించుకుంటున్నట్లు సమాచారం. ఇందుకోసం ప్రతిసారి వేలాది రూపాయలను ముట్టజెపుతున్నట్లు తెలిసింది. డాక్టర్ల రిపోర్ట్ మేరకు కడపకు చెందిన ఓ ప్రముఖ జీవిత ఖైదీకి ప్రతి నెలలో కనీసం రెండు లేదా మూడు సార్లు రిమ్స్‌కు పంపించి 'సకల మర్యాదలు' చేస్తున్నట్లు సమాచారం.

రోజాపై వ్యాఖ్యలపై..
ఆగ్రహం

- టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌పై ధ్వజం
- క్షమాపణ చెప్పాలని మహిళలు డిమాండ్



నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ వ్యాఖ్యలను ఖండిస్తున్న మహిళలు

కడప కార్పొరేషన్/బద్వేలు అర్బన్: చిత్తూరు జిల్లా నగరి టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మాజీ మంత్రి ఆర్‌కే రోజాపై చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. సభ్య సమాజం సిగ్గుపడేలా ఆయన రోజాను దుర్భాషలాడటాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం, ప్రజాప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. మహిళలను అవమానించడం, కించపరడం టీడీపీ నేతలకు పరిపాటిగా మారిందని, భాను ప్రకాష్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

అనుచిత వ్యాఖ్యలు తగవు



మాజీ మంత్రి ఆర్కే రోజాపై టీడీపీ ఎమ్మెల్యే గాలిభానుప్రకాష్ చేసిన అనుచిత వ్యాఖ్యలు తగదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థినులకు, యువతులకు, మహిళలకు రక్షణ లేకుండా పోయింది. ఇటీవల కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్, బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళ అయిన ఉప్పాల హారికను టీడీపీ నేతలు అసభ్యంగా దూషిస్తూ ఆమె వాహనంపై దాడి చేసిన ఘటన మరువకముందే మాజీ మంత్రి ఆర్కేరోజాపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు.
– డాక్టర్ దాసరి సుధ, ఎమ్మెల్యే, బద్వేలు

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదు

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదు కానీ మహిళా నాయకులపై దాడులు, అవమానాలు ఎక్కువ అయ్యాయి. మాజీ మంత్రి రోజాపై ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ వ్యాఖ్యలు బాధాకరం. రెండు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి మంత్రిగా పని చేసిన రోజాపై అసభ్యకరమైన విమర్శలు చేయడం సరికాదు. రాజకీయంగా విమర్శలు చేయండి.. వ్యక్తిగతంగా విమర్శలు చేస్తే మహిళల ఆగ్రహానికి గురవుతారు.
–ఏకుల రాజేశ్వరిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం

'గాలి'మాటలు మాట్లాడితే తాట తీస్తాం



నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ తన ఇంట్లో కూడా మహిళలు ఉన్నారని గుర్తించకుండా ఆర్‌కే రోజాపై గాలి మాటలు మాట్లాడాడు. మహిళల సమస్యలపై ఆమె గొంతెత్తి ప్రశ్నిస్తున్నందుకే ఇలా ఆత్మస్థైరాన్ని దెబ్బతీసేలా మాట్లాడుతున్నారు. ఈ ప్రభుత్వం ఎంతో కాలం ఉండదు. ఆ తర్వాత తగిన రీతిలో బుద్ధి చెబుతాం.
– బి.మరియలు, నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యురాలు, కడప

బహిరంగ క్షమాపణ చెప్పాలి

మాజీ మంత్రి ఆర్‌కే రోజాపై నగరి ఎమ్మెల్యే భాను ప్రకాష్ చేసిన వ్యాఖ్యలను ఉప సంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలి. మహిళ అని చూడకుండా పత్రికల్లో రాయలేని బండబూతులు తిట్టడం దుర్మార్గం, తెలుగుదేశం పతనానికి ఇవి నాంది పలుకుతాయన్న సత్యాన్ని గమనించాలి. ఇప్పుడు పోలీసులు చర్యలు తీసుకోకపోయినా గాలి భాను ప్రకాష్‌కు ప్రజా కోర్టులో శిక్ష తప్పదు.
– శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు

మహిళలంటే కనీస గౌరవం లేదు



తెలుగుదేశం పార్టీ నాయకులకు మహిళలంటే కనీస గౌరవం లేదు. ఇందుకు నిదర్శనం మాజీ మంత్రి రోజాపై టీడీపీ ఎమ్మెల్యే గాలిభానుప్రకాష్ చేసిన వ్యాఖ్యలే. అలాగే సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ మహిళా లోకం అసహ్యించుకునేలా ట్రోల్ చేయడం దుర్మార్గం. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలను ప్రశ్నిస్తున్నందుకే రోజాను టార్గెట్ చేశారనిపిస్తోంది.
– టీవీ వెంకట సుబ్బమ్మ, జిల్లా అధ్యక్షురాలు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం

క్లుప్తంగా

వీరబ్రహ్మేంద్రస్వామి మాస కల్యాణోత్సవానికి ఏర్పాట్లు



సిద్ధమైన కళ్యాణ మండపం

బ్రహ్మంగారిమఠం : జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మాస కళ్యాణోత్సవానికి బి.మఠం సిద్ధమైంది. ఇప్పటివరకూ స్వామికి ఏటా మహాశివరాత్రి, జయంతి రోజున కల్యాణ వేడుక నిర్వహించేవారు. భక్తులు, ఉభయదాతల విన్నపం మేరకు ప్రతినెలా స్వామి కల్యాణం నిర్వహించేందుకు వీరబ్రహ్మేంద్ర స్వామి క్షేత్రంలో ప్రత్యేక కళ్యాణ మండపం నిర్మించారు. పూర్వపు మఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి వారి పేరుతో ఉన్న ఈ మండపంలో ప్రథమ మాస కళ్యాణోత్సవాన్ని శుద్ధ ద్వాదశి రోజున నిర్వహించనున్నారు. ప్రతినెలా శుద్ధ ద్వాదశి నాడు మాస కళ్యాణం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. శాశ్వత ఉభయదాతలుగా చేరుటకు లక్ష రూపాయల డిపాజిట్ చెల్లించాలని ఆలయ నిర్వాహకులు కోరారు. భక్తులు పాల్గొని స్వామి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని మఠం పిటిపర్సన్ శంకర్‌బాలాజీ తెలిపారు.

క్రీడల అభివృద్ధే లక్ష్యం



కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ కడప జిల్లా వ్యాయామోపాధ్యాయుల సంఘం పటిష్టత, క్రీడల అభివృద్ధే తమ లక్ష్యమని ఏపీ పీఈటీ అండ్ ఎస్‌ఏ పీఈటీ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ ప్రవీణ్‌కిరణ్, ఎస్‌ఏపిఈ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ శివశంకర్‌రెడ్డి తెలిపారు. కడప శంకరాపురంలోని స్కాట్ హాల్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ జిల్లాలోని ఏపీ పీఈటీ అండ్ ఎస్‌ఏ పీఈటీ అసోసియేషన్, ఎస్‌ఏ పిఈటీ అసోసియేషన్‌లను విలీనం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబయ్య, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయం నిలిపివేత



గోదాములో తనిఖీ చేస్తున్న జేడీఏ చంద్రానాయక్

కడప అగ్రికల్చర్ : కడప నగరంలోని మార్క్‌ఫెడ్ ఎరువుల గోదామును జిల్లా వ్యవసాయ అధికారి(జేడీఏ) బి.చంద్రానాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. నిల్వలు పరిశీలించి జిల్లా వ్యాప్తంగా డీలర్లు, ఆర్బీకే, పీఏసీఎస్ కేంద్రాలకు ఎరువులు పంపిణీ చేయాలని సూచించారు. అలాగే వ్యవసాయశాఖ కర్నూలు డీఆర్సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏవో గోవర్ధన్, వ్యవసాయాధికారి సురేష్‌కుమార్ రెడ్డి సంయుక్తంగా కడప పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. అనుమతి పొందిన పురుగు మందులు అమ్మాలని, రైతులకు రసీదు ఇవ్వాలని సూచించారు. రికార్డులు సరిగా నిర్వహించని 26.94 లక్షల విలువ గల వాటర్ సాలిబుల్ ఎరువుల విక్రయం నిలిపివేసినట్లు వారు తెలిపారు.

ఈ కందిపప్పు మాకొద్దు

వెనక్కు పంపించేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు



బూజుపట్టిన కందిపప్పు



అంగన్వాడీ కార్యకర్తలు వెనక్కి ఇచ్చిన కందిపప్పు ప్యాకెట్లు

బద్వేలు అర్బన్ : చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యతలేని కందిపప్పు సరఫరా అవుతోంది. నాసిరకంగా ఉన్న ఈ కందిపప్పు మాకొద్దు అని అంగన్వాడీ కార్యకర్తలు వెనక్కి పంపేయడం ఇందుకు అద్దం పడుతోంది. బద్వేల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బద్వేల్ మున్సిపాలిటీ, బద్వేల్ రూరల్, గోపవరం, బి.కోడూరు, అట్లూరు మండలాల్లో 180 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో కొన్నింటికి ఇటీవల సరఫరా చేసిన కందిపప్పు పురుగులతో బూజుపట్టి ఉంది. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు తీసుకునేందుకు నిరాకరించారు. చేసేది లేక అంగన్వాడీ కార్యకర్తలు ఎంఎల్ఎస్ పాయింట్‌లో తిరిగి ఇచ్చేస్తున్నారు. నాసిరకం కందిపప్పు పంపిణీ చేయడంతో సమస్యలు ఎదురైతే మేము ఇబ్బంది పడాల్సి వస్తుందని అంగన్వాడీ కార్యకర్తలు వాపోతున్నారు.

36 క్వింటాళ్ల నాసిరకం కందిపప్పు వచ్చింది

ఇటీవల ఎంఎల్ఎస్ పాయింట్‌కు వచ్చిన 36 క్వింటాళ్ళ కందిపప్పు నాసిరకంగా ఉంది. ఆగస్టు వరకు గడువు ఉన్నా.. కొంతమేర బూజు పట్టి ఉండడం చూసి జిల్లా ఉన్నతాధికారులకు విషయం విన్నవించాను. తక్షణమే కందిపప్పును వెనక్కి పంపించాలని ఆదేశాలిచ్చారు. అంగన్వాడీ కార్యకర్తలు వెనక్కి తెస్తున్న కందిపప్పు స్థానంలో మంచి కందిపప్పు అందిస్తున్నాం.

– అలీఖాన్, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి

పాత పింఛన్ అమలు చేయాలని నిరసన



ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్ : తమకు పాత పెన్షన్ విధానం అమలుచేయాలని డీఎస్సీ 2003 ఉపాధ్యాయ ఫోరం నాయకులు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ఎస్‌జీటీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. కడప కలెక్టరేట్ వద్ద డీఎస్సీ 2003 ఉపాధ్యాయ ఫోరం జిల్లా కన్వీనర్ గుజ్జల తిరుపాల అధ్యక్షతన ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెమో నెంబర్ 57ను అమలు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వెంకటజనార్దనరెడ్డి, ఎన్‌డీఏ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు జనార్దన్‌రాజు, పీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, ఎస్ఎల్‌డీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నెంబర్ ప్రకారం అర్హులైన వారందరికీ పాత పెన్షన్ వర్తింపచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం కన్వీనర్లు సుధాకర్, చాంద్‌బాషా, రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, సునీత, రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

11 మంది గంజాయి విక్రేతల అరెస్టు

నాలుగు కిలోల గంజాయి, ఏడు ద్విచక్ర వాహనాలు, ఆటో స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడప నగర శివారులో గంజాయి విక్రయిస్తున్న 11 మందిని అరెస్టు చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ చింతకొమ్మదిన్నె చెరువు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారంతో తనిఖీలు చేసి చింతకొమ్మదిన్నెకు చెందిన కవ్వాజి పవన్‌కుమార్, మద్దెల వెంకటరమణ, ఖాజీపేట మండలం కొమ్మలూరు గ్రామానికి చెందిన రాజోలు చంద్రశేఖర్‌రెడ్డి, కడప నగరం అక్కాయపల్లెకు చెందిన షేక్ ఇంతియాజ్, చింతకొమ్మదిన్నె మండలం కృష్ణాపురానికి చెందిన కె.వెంకటసాయి, చప్పిడి దేవేంద్ర కలిసి బద్వేల్ ప్రాంతానికి చెందిన వ్యక్తి వద్ద కిలో గంజాయి రూ.15 వేలుకు కొనుగోలు చేశారన్నారు. వాటిని చిన్న 10 గ్రాముల ప్యాకెట్‌గా చేసి రూ.500కు కళాశాలలు, సర్కిల్‌ల్లో అమ్మేవారన్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ నరసింహ, సిబ్బంది దాడి చేసి మొత్తం ఆరుగురిని అరెస్ట్ చేశారన్నారు. వారి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇందిరానగర్‌లో.....

ఇందిరానగర్‌లో కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణకుమార్ ఎస్ఐ మహేంద్ర సిబ్బంది దాడి చేసి గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేశారు. చింతకొమ్మదిన్నె గ్రామానికి చెందిన తొండూరి అపెనుకొండ అలియాస్ బాబీ, కడప నగరం రాజీవ్ నగర్‌కు చెందిన గొడుగు అజీజ్ నుంచి కొని అక్కాయపల్లెకు చెందిన దేరంగుల పవన్ కళ్యాణ్, చెమ్ముమియ్యాపేటకు చెందిన ఓర్సు నరసింహ, పుట్లంపల్లెకు చెందిన పాడుతూరు గౌస్ మోహిద్దీన్ అమ్మకాలు సాగించేవారన్నారు. గంజాయి అమ్మకాలపై నిరంతరం తమ సిబ్బందితో నిఘా ఉంచామన్నారు. ప్రధాన నిందితుడు బద్వేలు ప్రాంతానికి చెందిన వ్యక్తి పరారీలో ఉన్నాడని త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. విద్యార్థులు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు.

సర్వేను అడ్డుకున్నారు

కడప రూరల్ : తన భూమి సర్వే చేయించుకునేందుకు వెళ్తే అడ్డుకుంటున్నారని హైదరాబాద్‌కు చెందిన క్రిష్ణయ్య ఆరోపించారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కడప మండలంలోని సర్వే నెంబరు 78–బీలో తన తండ్రి నరసరామయ్యకు 2.52 ఎకరాల స్థలం ఉందన్నారు. అందులో 2006లో ఫాతిమా ఎడ్యుకేషనల్ సొసైటీకి 1.25 ఎకరాలను విక్రయించామని, మిగిలిన స్థలం సర్వే చేయించుకోవాలని కోర్టును ఆశ్రయించామని అన్నారు. కోర్టు నుంచి అనుమతి రావడంతో స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి వెళ్లగా ఫాతిమా ఎడ్యుకేషన్ సొసైటీ వారు అడ్డగించారని ఆరోపించారు. మహమ్మదీయ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు జవాబ్ ఎక్కు మాట్లాడుతూ శుక్రవారం దీప, విజయ, మరికొందరు స్థలం వద్దకు వచ్చి దౌర్జన్యం చేయగా తాము ప్రశ్నించామని పేర్కొన్నారు. ఆ స్థలం నరసయ్య, నరసింహ మూర్తిది కావడంతో తాము చట్ట ప్రకారం కొనుగోలు చేశామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు తమ వద్ద ఉన్నాయన్నారు. తాము కూడా న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు. తహసీల్దారు నారాయణరెడ్డి మాట్లాడుతూ పోలీసుల పర్యవేక్షణలో వచ్చే వారంలో సర్వే చేస్తామన్నారు.

బీసీ వసతి గృహంలో విచారణకు ఆదేశం

సుండుపల్లె : మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహ భవనంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ విచారణకు ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక అప్పన్నకుంటలో సర్వే నెంబర్–2169లోని ప్రభుత్వ స్థలంలో చెరువుకిందపల్లెకు చెందిన తిరుమలరెడ్డి శివారెడ్డి భవనం నిర్మించి బీసీ బాలల వసతి గృహానికి అద్దెకు ఇచ్చారని బీజేపీ నాయకుడు వెంకటరామరాజు మంత్రి, ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని స్వాధీనం చేసుకుని ఇప్పటివరకూ తీసుకున్న అద్దె రికవరీ చేయాలని ఆయన కోరారు. వెంటనే విచారించాలంటూ జిల్లా అధికారులకు ఆదేశాలందాయి.

కాన్వకేషన్‌కు రావాలంటూ గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్ అబ్దుల్‌నజీర్‌ను సత్కరిస్తున్న వీసీ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం కాన్వకేషన్‌కు అనుమతి ఇవ్వాలని, కులపతి హోదాలో కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్‌ను వైవీయూ ఇన్‌చార్జి వీసీ అల్లం శ్రీనివాసరావు కోరారు. విజయవాడ రాజభవన్‌లో రాష్ట్ర గవర్నర్‌ను శుక్రవారం ఆయన కలిసి మొక్క అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. యోగి వేమన విశ్వ విద్యాలయం గురించి గవర్నర్‌కు వివరించారు. గవర్నర్ స్పందిస్తూ ఆగస్టు చివరి వారంలో లేదా సెప్టెంబర్ మొదటి వారంలో కాన్వకేషన్ నిర్వహించుకోవాలని, ఆయా తేదీల వివరాలు తమ కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు. ఉపకులపతి వెంట విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్వీ.కృష్ణారావు ఉన్నారు.

ఉత్సాహంగా ఏసీఏ అండర్–19 క్రికెట్ మ్యాచ్



గురుమోహన్ (66 పరుగులు)



నేత్రానంద (4 వికెట్లు)



ప్రణవ శాస్త్రి (3 వికెట్లు)

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–19 మల్టీ మ్యాచ్‌లు రెండో రోజున ఉత్సాహంగా సాగాయి. కెఓఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు– అనంతపురం జట్ల మధ్య మ్యాచ్ కొనసాగింది. 93 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్ ప్రారంభించిన అనంతపురం జట్టు 60.2 ఓవర్లలో 203 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని టి.కిరణ్‌కుమార్ 66, సాత్విక్ 23 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని నేత్రానంద నాలుగు, విక్రాంత్ రెడ్డి 2, రిత్విక్ రెండు వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 61 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. ఆ జట్టులోని గురు మోహన్ 66 పరుగులు, రిషి కుమార్‌రెడ్డి 57 పరుగులు, చేశారు. అనంతపురం జట్టులోని దేవాన్ష్ 3 వికెట్లు తీశాడు. దీంతో నెల్లూరు జట్టు 246 పరుగుల అధిక్యంలో ఉంది. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

వైఎస్ఆర్ఆర్ ఏసీసీ స్టేడియంలో......

వైఎస్సార్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కడప–కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ కొనసాగింది. రెండో రోజు శుక్రవారం 54 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్ ప్రారంభించిన కడప జట్టు 51.2 ఓవర్లలో 114 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సీఎండీ ఫైజాన్ 40, కశ్యప్‌రెడ్డి 23 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని వై.రిత్విక్ కల్యాణ్ ఐదు, సాయి విఘ్నేష్ 2, వివేక్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 57.5 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని రోహిత్ గౌడ్ 51 పరుగులు, హరిహరన్ 22 పరుగులు చేశారు. కడప జట్టులోని జయ ప్రణవ్ శాస్త్రి 3 వికెట్లు, చెన్నకేశవ 2 వికెట్లు, గైబు 2 వికెట్లు తీశారు. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

మోదీ, చంద్రబాబుతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య



మాట్లాడుతున్న జి.ఈశ్వరయ్య

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : దేశాన్ని ప్రగతి పథాన నడిపించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, మోదీ, చంద్రబాబుతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య అన్నారు. కడప నగరంలోని విశ్వేశ్వరయ్య ఇంజినీరింగ్ భవన్‌లో సీపీఐ కడప నగర సమితి ఏడో మహా సభలు శుక్రవారం నిర్వహించారు. ముందుగా కడప నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి సంధ్య సర్కిల్, ఎర్రముక్కపల్లి సర్కిల్, గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్ మీదుగా విశ్వేశ్వరయ్య మందిరం వరకూ ర్యాలీగా వస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలు మోదీ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు దేశ సంపద దోచిపెడుతున్నారని ఆరోపించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి లౌకిక రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేయడం, మనుస్మృతి విధానాలతో పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. మోదీ, బాబు డబుల్ ఇంజిన్ సర్కార్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నాయని, చంద్రబాబు 21 సార్లు ఢిల్లీకి వెళ్లి రూ.3600 కోట్లు అప్పు తెచ్చారన్నారు. పెండింగ్‌లో ప్రాజెక్టులను ప్రక్కన పెట్టి బనకచర్ల నిర్మాణం అంశాన్ని తెరమీదకు తీసుకురావడాన్ని తప్పుబట్టారు. అంతర్జాతీయ విమానాశ్రయం కోసం మరో 40 వేల ఎకరాల భూ సేకరణ, మెట్రో రైలు అంటూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని విమర్శించారు. జిల్లా కార్యదర్శి గాలిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం, ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరుగుతున్నాయని, మద్యం అమ్మగా వచ్చిన డబ్బుతో సంక్షేమ పథకాలు అమలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్.వెంకటశివ, ఎల్.నాగసుబ్బారెడ్డి, పి.చంద్రశేఖర్, జి.వేణుగోపాల్, విజయలక్ష్మి, నాగార్జునరెడ్డి, చెంచయ్య మల్లికార్జున, మనోహర్ రెడ్డి, లింగన్న పాల్గొన్నారు.

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని ఇద్దరు దుర్మరణం



బోల్తాపడిన లారీ



ప్రమాదంలో మృతిచెందిన డ్రైవర్, క్లీనర్

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిలోని గంగాదేవిపల్లె సమీపంలో శుక్రవారం వేగంగా వస్తున్న లారీ రహదారి ప్రక్కనే వున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ కమల్ సాహెబ్(64), క్లీనరు ఫక్రుద్దీన్(45) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఎస్ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు.. బళ్లారి నుంచి ఇనుప పైపుల లోడుతో లారీ చెన్నైకు వస్తోంది. శుక్రవారం తెల్లవారుజామున గంగాదేవిపల్లె సమీపంలోకి రాగానే వేగం అదుపుతప్పి లారీ రహదారి ప్రక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. లారీలో ఉన్న డ్రైవరు, క్లీనరుపై ఇనుప పైపులు పడిపోయాయి. దీంతో ఇరువురు క్యాబిన్‌లో ఇరుక్కుపోయి చనిపోయారు. సమచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతిచెందిన వారు బళ్లారి వాసులుగా గుర్తించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయుల వేతన సమస్యలను పరిష్కరించాలి



ఉప సంచాలకులకు విన్నవిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల వేతన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి కోరారు. జిల్లా ఖజానా శాఖ ఉప సంచాలకులు వెంకటేశ్వర్లును శుక్రవారం ఆయన కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్‌లో టీచర్ల బదిలీలు జరగ్గా.. రీఅపోర్షన్‌లో భాగంగా నూతన పాఠశాలలలో చేరిన ఉపాధ్యాయులకు వెంటనే పొజిషన్ ఐడీలను కేటాయించాలన్నారు. జూన్ నెల నుంచి వేతనం చెల్లించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. 24 ఏళ్లు పూర్తయిన టీచర్లకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కేల్ మంజూరు చేయడంలో జాప్యం లేకుండా చూడాలని, పదవీవిరమణ చెందిన టీచర్లకు పెన్షన్ మంజూరు పత్రాలు పంపడంలో జాప్యం చేయవద్దని డిమాండ్ చేశారు. సరెండర్ లీవు బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు హరిబాబు, జిల్లా కౌన్సిలర్లు రామచంద్రారెడ్డి, రామసుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా యువకుల రక్తదానం

స్టెప్ సీఈఓ సాయి గ్రేస్



రక్తదానం చేస్తున్న యువకుడితో సంస్థల సభ్యులు

కడప ఎడ్యుకేషన్ : కడప బాలాజీ నగర్‌లోని నెహ్రూ కేంద్ర యూత్ హాస్టల్ నందు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని స్టెప్ సీఈవో సాయి గ్రేస్, పైడికాల్వ విజయ్‌కుమార్, ఖూన్‌కా రిష్తా చైర్మన్ యం.తారీఖ్‌అలీ తెలిపారు. స్వచ్ఛంద సేవా సంస్థలు , ఖూన్ కా రిష్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ మాట్లాడుతూ జిల్లాలోని స్వచ్ఛంద సేవా సంస్థలు ఐక్యమతంగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. బ్లడ్‌బ్యాంక్ నందు రక్త నిల్వలు తక్కువ ఉన్నాయని, 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ప్రతి మూడు నెలలకోకసారి రక్తదానం చేయుటకు ముందుకు రావాలన్నారు. దీంతో పాత కణాలు పోయి కొత్త కణాలు వచ్చి ఆరోగ్యంగా ఉంటామని తెలియజేశారు.. ఖూన్ కా రిష్తా చైర్మన్ యం.తారీఖ్‌అలీ మాట్లాడుతూ రక్తదాన శిబిరాల్లో ఇప్పటివరకు 315 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూటూరు విజయ్ కుమార్, వి.శివ శంకర్, పట్టుపోగుల సుబ్బారావు, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోమొబైల్ దుకాణం తనిఖీ

రాయచోటి జగదాంబసెంటర్ : కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రాయచోటి–చిత్తూరు రోడ్డులోని రాందేవ్ ఆటోమొబైల్స్ షాపును విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలో కొనుగోలు చేసే వస్తువులపై ఎంఆర్‌పీ ధరలు లేవని, జీఎస్టీ లైసెన్సు లేకుండా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు తనిఖీ అధికారులు గుర్తించారు. రాజధాని ఆటో మొబైల్స్, రాందేవ్ ఆటో మొబైల్స్ పేర్లతో వేర్వేరుగా యజమాని వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు తనిఖీ అధికారులు గుర్తించారు. ఈ షాపులో సేల్ బిల్స్ ఇవ్వడం లేదని గుర్తించి దుకాణాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎం.శివన్న, గీతావాణి, బాబుమోజెస్, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఎనిమిది మందికి గాయాలు





తీవ్రంగా గాయపడిన హేమకుమార్, డివైడర్‌ను ఢీకొన్న కారు

మదనపల్లె రూరల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడి మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ వంక వడ్డిపల్లెకు చెందిన ఈశ్వరయ్య(65), అతడి భార్య సుందరమ్మ(60) గురువారం రాత్రి ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వచ్చారు. గ్రామంలో గొడవ విషయమై తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసి స్వగ్రామానికి వెళ్తున్నారు. కొత్తవారిపల్లె సమీపంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం వీరిని ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. అదే విధంగా పీలేరుకు చెందిన తరుణ్(20), అష్రఫ్(22), నిఖిల్(21), బాలాజీ(23), ప్రేమ్‌కుమార్(22) వ్యక్తిగత పనులపై గురువారం కారులో మదనపల్లెకు వచ్చారు. పనులు ముగించుకుని శుక్రవారం తెల్లవారుజామున తిరిగి పీలేరుకు బయలుదేరారు. బైపాస్ దారిలో వెళుతుండగా కొత్తవారిపల్లె సమీపంలో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో ఐదుగురు గాయపడగా స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా బి.కొత్తకోటకు చెందిన హేమకుమార్ గురువారం రాత్రి ద్విచక్ర వాహనంలో బెంగళూరుకు వెళ్తున్నారు. గౌనిపల్లె సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బాధితుడిని తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

రూ.20 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం

ఏడుగురు నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చేసిన అటవీ అధికారులు

పీలేరు : రూ.20 లక్షల విలువైన ఎర్ర చందనం స్వాధీనం చేసుకుని ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పీలేరు డీఎఫ్‌వో గురుప్రభాకర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం తెల్లవారుజాము నుంచి కల్లూరు నాలుగు రోడ్ల కూడలిలో వాహనాలను తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా వచ్చిన మారుతి సుజుకీ వాహనాన్ని తనిఖీ చేయగా 13 ఎర్రచందనం దుంగలున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనంతోపాటు ఎర్రచందనం స్వాధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో ఏలుమలై, సెంథిల్, అన్‌బలగన్, రామన్, అన్నాదొరై, కుప్పుస్వామి, మణి ఉన్నట్లు డీఎఫ్‌వో వివరించారు. ఈ దాడిలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, సిబ్బంది ప్రకాష్‌కుమార్, ప్రతాప్, రెడ్డిప్రసాద్, నందీశ్వరయ్య పాల్గొన్నారు.